క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్ల వారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాస శుద్ధ విదియ సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు జరిపారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు.

కొలిక్కిరాని యూజీడీ పనులు



శ్రీనగర్ రోడ్డులో జరుగుతున్న యూజీడీ పైప్‌లైన్ పనులు

సీతంపేట: జీవీఎంసీ పరిధిలో పదేళ్లుగా యూజీడీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నా.. ఇంకా కొలిక్కిరాలేదు. పైప్‌లైన్ వేయలేదని, కనెక్టివిటీ లేదని ఇంకా ఎక్కడో చోట రహదారులను తవ్వుతూనే ఉన్నారు. రామాటాకీస్ రోడ్డు నుంచి ద్వారకానగర్‌కు వెళ్లే శ్రీనగర్ మార్గంలో యూజీడీ పైప్‌లైన్ వేయలేదని రోడ్డును తవ్వుతున్నారు. మూడు రోజులుగా పనులు జరుగుతున్నాయి. రద్దీగా ఉండే మార్గం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అధికారులు దృష్టి సారించి యూజీడీ పనులు త్వరితగతిన పూర్తి చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



రైల్వే న్యూకాలనీలో మజ్జిగ పంపిణీ చేస్తున్న జగదీష్ తదితరులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు వద్ద టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు, బాటసారులకు మజ్జిగ, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కరణం వెంకటరావు, సెక్రటరీ ముక్కి రామకృష్ణ, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఎస్.కె.గౌస్, రాము, సుక్కు, నవీన్, హరీష్, చోటా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



అక్కయ్యపాలెం పెద్దూరు మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



జాకీర్‌హుస్సేన్ నగర్ మసీదు వద్ద ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఆచరిస్తున్న ముస్లింలు

ప్రత్యేక నమాజ్‌లు ఆచరించిన ముస్లింలు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో శనివారం పవిత్ర రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, కంచరపాలెం ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్-ఎ-క్యూబా, అక్కయ్యపాలెంలోని చిన్నూరు, పెద్దూరు మసీదులు, రేసపువానిపాలెం యాసిన్ మసీదులో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై నమాజ్ చేశారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదులు, ఖబ్రస్థాన్‌లకు వెళ్లి ప్రార్థనలు జరిపారు.

పేదలు, అనాథలకు దానాలు..

26వ వార్డు రామకృష్ణానగర్ చోటీబస్తీలో మసీద్ ఈ నూర్ కమిటీ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ముస్లింలు నమాజ్ చేశారు. మత పెద్దలు, మసీద్ ప్రతినిధులు ఖురాన్ చదివి వినిపించారు. నమాజ్‌కు ముందు పేదలు, అనాథలకు ఫిత్రా, జకాత్ దానాలు చేశారు. జగ్గారావు బ్రిడ్జి వద్ద ఖబ్రస్థాన్‌లో పెద్దల సమాధుల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసారు. 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్ ఈక్యూబా, 80 ఫీట్ రోడ్ ఈద్గాలో మజీద్ హఫీజ్ ముస్తేజాబ్ తురుక్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరి నమాజ్ నిర్వహించారు. అబిద్ నగర్‌లో షియా ముస్లింలు ప్రార్థనలు చేశారు.

53వ వార్డు మసీదుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మసీదుల్లో ప్రత్యేకప్రార్థనలు చేశారు. మర్రిపాలెం మస్జిద్-ఈ-అల్ ఫతా, జాకీర్‌హుస్సేన్ నగర్ మస్జిద్-ఈ-అల్ ఖదీర్‌లోని ఈద్గా స్థలం వద్ద పెద్ద ఎత్తున ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఆచరించారు. వేకువజామున ఫజర్ నమాజ్ చేసి అనంతరం ఆయా మసీద్‌ల నుంచి ర్యాలీగా ఈద్గా స్థలానికి చేరుకున్నారు. మత గురువులు తక్రీర్ పాటించారు. ఖురాన్‌లో సూక్తులు వివరించారు. అనంతరం ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. కార్యక్రమాన్ని మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, గౌస్ తదితరులు పర్యవేక్షించారు.

అయ్యప్పనగర్ మసీద్‌లో..

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని అయ్యప్పనగర్ మసీద్-ఇ-నభవిలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదు అధ్యక్షుడు షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఈద్ నమాజ్ చేశారు. మసీద్ ఇమామ్ ఖమర్ ఆలం ప్రార్థనలు జరిపారు. సమాజంలో ప్రతి ఒక్కరిపై అల్లా ఆశీస్సులు ఉంటాయన్నారు. బర్మా క్యాంప్, మురళీనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, మాధవధార, వుడా కాలనీ, తెన్నేటినగర్ వరకు ఉన్న ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస దీక్షలు

తాటిచెట్లపాలెం: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు శనివారంతో దీక్ష విరమించారు. 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని మసీదుల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సంతోషంతో గడిపారు. పేదలకు దానధర్మాలు చేశారు.



80 ఫీట్ రోడ్డులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రైల్వే న్యూకాలనీ మసీదులో ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న ముస్లింలు

46వ వార్డులో అభివృద్ధి పరుగులు

రూ.1.36 కోట్ల పనులకు శంకుస్థాపన

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో అభివృద్ధి పనులకు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1,36,15,000 వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జోన్-5 ఈఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. రెండంతస్తుల నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.49 లక్షలు, నూతన కళావేదిక నిర్మాణానికి రూ.35 లక్షలు, కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు రూ.15.45 లక్షలు, రక్షణ గోడ నిర్మాణానికి రూ.19 లక్షలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మెట్లమార్గాల నిర్మాణాలకు రూ.17.70 లక్షల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో డీఈ భరణికుమార్, ఏఈ అర్చన, పార్టీ నాయకులు అప్పారావు, బలిరెడ్డి గోవింద్, వై.వి.రాజు, దూది నర్సింగరావు, శ్రీను, కె.రామారావు, ఈశ్వరరావు, కంటిపాము గురువోజీ, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శంకరమఠం రోడ్డులో గల రామకృష్ణానగర్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయంలో రూ.9.05 లక్షల నగదు చోరీకి పాల్పడిన సూర్యనారాయణను క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. బంగారు రవి, నాయుడు కలిసి రామకృష్ణానగర్‌లో ఎస్ఎస్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ నెల 17వ తేదీ రాత్రి కార్యాలయ డెస్క్‌లో వారు భద్రపరచిన రూ.9.05 లక్షలు మాయమైంది. రవి, నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు కార్యాలయానికి వచ్చి పరిశీలించారు. సంస్థలో పనిచేస్తున్న సూర్యనారాయణ అనే వ్యక్తి నగదు దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

చిత్ర పరిశ్రమకు విశాఖ అనుకూలం

సీతంపేట: చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి విశాఖ అనువైనదని ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆస్కార్ బెస్ట్ ఫిల్మ్, 7 అవార్డులు పొందిన ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ అల్ ఎట్ వన్స్' చిత్రాన్ని ప్రదర్శించారు. దీనికి ముందుగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు కూడా అనుకూలమైన ప్రాంతమని, ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని సూచించారు. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదనే సందేశాన్ని ఎవ్రీథింగ్ చిత్రంలో చక్కగా చూపారన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'ది వేల్' చిత్రాన్ని ప్రదర్శిస్తామని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో బి. చిన్నారావు, అనూరాధ, హరనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య ప్రసాదరావు

నేడు అన్నసమారాధన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రారంభించిన అలవేలు మంగమ్మ అన్నసమారాధన భవనంలో అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నారు. వైభవుడికి ప్రత్యేక పూజలు, అనంతరం దర్శనాలు ఉంటాయి. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి శనివారం ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమాన్ని ఇకపై అన్నసమారాధన భవనంలో నిర్వహిస్తారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: స్వరరాగ తరంగిణి, స్వరార్చన సంస్థలు సంయుక్తంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు అల్లిపిల్లి నరసింగరావు, భూపతిరావు, సత్యవతి, కల్యాణి, నర్సింగ్, ఎస్.రాజేశ్వరి, రాధారాణి.. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ నటించిన చిత్రాల్లోని హిట్ సాంగ్స్ పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మహ్మద్ ఖాన్, చెన్నా తిరుమలరావు, సన్యమూర్తి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సిటీ టెర్రస్ గార్డెన్స్, వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులో నీడనిచ్చే మొక్కలతోపాటు బ్యూటిఫికేషన్ మొక్కలు నాటారు. మనిషికి, మట్టికి ఉన్న అవినాభావ సంబంధం, మొక్కల పెంపకంతో పర్యావరణానికి జరిగే మేలు గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు, సిటీ టెర్రస్ గార్డెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మొక్కలు నాటుతున్న మహిళలు

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల విజేత సివిల్ ఇంజినీరింగ్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: ఈకో రైల్వే వాల్తేర్ డివిజన్ అంతర విభాగాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సివిల్ ఇంజినీరింగ్ జట్టు విజేతగా నిలిచింది. జట్టు లిఫ్టర్లు రెండు స్వర్ణాలు, మూడు రజతాలతో 18 పాయింట్లు సాధించారు. డీజిల్ లోకో జట్టు 14 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది.

- క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆఫీసర్స్ జట్టు నాలుగు వికెట్లకు 229 పరుగులు చేయగా.. స్టోర్స్ విభాగం 98 పరుగులు మాత్రమే చేయగలిగింది.

నేలతల్లిని స్మరించే గొప్ప సంస్కృతి మనది

ఏయూక్యాంపస్: పుడమి పరిరక్షణలో ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తెరిగి నడచుకోవాలని చినజీయర్ స్వామి అన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సాయంత్రం వికాస తరంగిణి నిర్వహించిన మన భూమి-మన బాధ్యత కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. నిత్యం ఉదయం నిద్రలేస్తూనే నేలతల్లికి నమస్కరించి, స్మరించే గొప్ప సంస్కృతి మన సొంతమన్నారు. మనమంతా నేలతల్లి ఒడిలో ఆటలాడే పిల్లలమన్నారు. ధరిత్రీ పరిరక్షణకు మనలో మనం ఆలోచన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. విశ్వంలో మన స్థానం ఏంటని ఒకసారి మానవులు ప్రశ్నించుకోవాలన్నారు. గాలి,నీరు, ప్రాణికోటి బాగుంటేనే మనం బాగుంటామనే విషయం మరువకూడదన్నారు. అహోబిల జీయర్ స్వామి మాట్లాడుతూ యువశక్తి సమాజ హితాన్ని కాంక్షించాలన్నారు. ఆదర్శవంతమైన జీవనం సాగించడం అలవరచుకోవాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాణిని సంరక్షిస్తూ ధరిత్రిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఏయూ నిర్వహించే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో జీయర్ స్వామి నిర్వహించే కార్యక్రమాలు అనుసంధానం చేయాలని కోరారు. సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని విస్మరిస్తే ముప్పు తప్పదనే విషయాన్ని కథారూపంలో విద్యార్థులకు వివరించారు. వికాస తరంగిణి సభ్యులు టి.టి.వి రమణ మూర్తి, సాతులూరి రామానుజం, పి.పద్మనాభ రావు, నారాయణ రెడ్డి, అడుసుమిల్లి రాము ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

జర్నలిస్ట్‌లు సమాజ ప్రగతి సాధకులు

సీతంపేట: సమాజంలో మంచిని ప్రభావితం చేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు మాత్రమే ఉంటుందని శ్రీశారదా పీఠం ఉత్తర పీఠాధిపతి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం వాస్తవం మాసపత్రిక ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులను స్వామీజీ చేతుల మీదుగా సత్కరించారు. మీడియా రంగంలో విశేష సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్ రావులవలస రామచంద్రరావు, కిల్లి ప్రకాష్‌రావు, సామాజిక రంగంలో పైడి శ్రీనివాస్, క్రీడా రంగంలో పొన్నాడ అప్పారావులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ శ్రీశారదా పీఠం నిరాదరణకు గురైన వర్గాల వెంట ఉంటుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో హైందవ ధర్మాన్ని కాపాడే క్రమంలో గిరిజనులను ఆలయాలకు మరింత చేరువ చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘం నాయకుడు మంత్రి రాజశేఖర్, సీనియర్ జర్నలిస్టులు ఎం.ఆర్.ఎస్.వర్మ, ఎస్ఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రరావును పురస్కారంతో సత్కరిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు



అంధకారంలో దుర్గానగర్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం తోట వీధి నుంచి దుర్గానగర్, గొల్లకంచరపాలెం ప్రాంతాలకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలకు లైట్లు లేవు. దీంతో రాత్రి వేళ చీకట్లలో నిత్యం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ సమస్యపై స్పందన కార్యక్రమంలో వినతిపత్రాలు అందించినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పలు స్తంభాలకు విద్యుత్ లైట్లు లేకపోవడంతో కొందరు ఆకతాయిలు ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలకు లైట్లు అమర్చాలి.

– సుధీర్‌కుమార్, తోట వీధి

కాలువపై విరిగిన సిమెంట్ దిమ్మె



దయానందనగర్‌లో ప్రమాదకరంగా కాలువ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం చాకలిగెడ్డ దయానందనగర్ ప్రాంతంలోని కాలువలపై సిమెంటు దిమ్మెలు విరిగిపోయాయి. అటుగా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువలపై సిమెంటు దిమ్మెలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారాయి. అధికారులు స్పందించి విరిగిన సిమెంట్ దిమ్మెలను తొలగించి కొత్తవి వేయాలి.

– ఎం.నూకరాజు, దయానందనగర్

సర్వీస్ లెజెండ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: వరహా వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్టు, నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ సంయుక్తంగా ఈ నెల 30న జిల్లా పరిషత్ హాల్‌లో ఇంటర్నేషనల్ సర్వీస్ లెజెండ్ అవార్డుల ప్రదానం చేయనున్నట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రసాద్ మారెళ్ల తెలిపారు. నరసింహనగర్‌లోని కన్జ్యూమర్ రైట్స్ కార్యాలయంలో శనివారం ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఈ అవార్డులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగే సదస్సులో విశిష్ట సేవకులు తమ అనుభవాలు, నైపుణ్యాలను వివరిస్తారని చెప్పారు. విద్య, వైద్య, కళా, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా, ప్రభుత్వ, ప్రైవేట్ ఆర్గనైజేషన్లు, ఎన్జీవో సంస్థలు, మీడియా రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తుల నుంచి అవార్డుల నామినేషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగత ప్రొఫైల్, సంస్థ సేవా కార్యక్రమాల వివరాలను islegendawards2023@gmail.comకు ఈ నెల 26లోగా మెయిల్ చేయాలని కోరారు. ఆసక్తి గల వారు ముందుగా 738698 9289, 0891 3510591 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

ధరిత్రిని కాపాడుకుందాం



బిర్లా జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్నవాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

మురళీనగర్: పుడమితల్లిని కాపాడుకోకుంటే మానవ జాతి మనుగడుకు ముప్పు తప్పదని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా శనివారం బిర్లా జంక్షన్ అంబేద్కర్ విగ్రహం నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు ధరిత్రిని కాపాడుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునికత పేరుతో వృక్షాలను తొలగించడమే కాకుండా వాడి పారేసే ప్లాస్టిక్ వంటి అనేక వ్యర్థాలతో మానవాళి భూమిని నింపేస్తోందన్నారు. ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. ధరిత్రిని కాపాడుకుందామని ప్లకార్డు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మట్టి కుండల్లో వేసిన మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో-ఆర్డినేటర్ పిల్లా అర్జునుడు, త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.ఆర్.ఎస్.మహేష్, త్రీ స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు రమణమ్మ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, ప్రభావతి, రోజారాణి, ఫీలా రాణి, మాధవి, నాగేశ్వరరావు, ప్రమీల, జ్యోతి, జయ పాల్గొన్నారు.

అల్లు రమేష్ మరణం తీరని లోటు

సీతమ్మధార: రంగ స్థల, టీవీ, సినీ నటుడు అల్లు రమేష్ మరణం దురదృష్టకరమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, రంగసాయి నాటక సంఘం సంయుక్తంగా సంతాప సభ ఏర్పాటు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాటక దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అల్లు రమేష్‌తో తనకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అల్లు రమేష్ మరణం కళాకారులకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళా రంగ ప్రముఖులు వై.అప్పారావు, బాదంగీర్ సాయి, ఎం.ప్రసాద్, బి.ధవళేశ్వరరావు, చెన్నా తిరుమలరావు, బి.స్వర్ణ, బ్రహ్మాజీ, మారుతీ ప్రసాద్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.



అల్లు రమేష్ సంతాప సభలో నివాళులర్పిస్తున్న వక్తలు

అదరగొట్టిన తెలుగమ్మాయిలు

సీతమ్మధార: స్థానిక క్షత్రియ కల్యాణ మండపం సమీపంలోని ఐశ్వర్య హాల్‌లో ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ ఆధ్వర్యంలో శనివారం లలితా జ్యువెలరీ తెలుగమ్మాయి పోటీల క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. పల్లెటూరి హీరోయిన్ల స్టైల్ రౌండ్‌లో భాగంగా పెళ్లయిన, పెళ్లి కాని విభాగాల్లో మహిళలు, అమ్మాయిలు పాల్గొని అదరగొట్టారు. నాటి హీరోయిన్లు సంప్రదాయ వాతావరణంలో ఎలా ఉంటారో గుర్తొచ్చేలా పొలం, తట్ట, బుట్ట, కొడవలి, కర్రలు, ముంజులు, చెరుకు, చాట, కుండ లాంటి వస్తువులను పట్టుకుని అద్భుతంగా నడిచి ఔరా అనిపించారు. న్యాయనిర్ణేతలుగా నారి శోభ, యూట్యూబర్ ఆర్.మధు, రచన, మోడల్ రేవతి వ్యవహరించారు.



సంప్రదాయ దుస్తుల్లో తెలుగమ్మాయిలు